# మధురం...మధురం

" అధరం మధురం...నయనం మధురం...మధురాధిపతే అఖిలం మధురం..." వంట చేస్తూ విశాలాక్షి తీస్తున్న కూనిరాగం విన్న వాసుదేవరావ్ " ఓ మారు ఇటు వస్తావా...?" అని పిలిచాడు.

చేస్తున్న పని ఆపేసి, ఆవిడ హడావుడిగా మంచం మీద నీరసంగా పడుకుని ఉన్న భర్త దగ్గరకు వచ్చి " ఆకలిగా వుందా, తినటాకిని ఏమైనా తీసుకురానా..?" అనడిగింది.

వద్దన్నట్లుగా తలవూపిన ఆయన " నీ పాట కొంచెం మెల్లగా వినిపించి...ఇక్కడే కూర్చుని పాడమని అడగాలని పిలిచాను..! " అన్నాడు చిరునవ్వుతో.

ఆవిడ ఫక్కుమంది. " పనులు చేస్తూ తీసే కూనిరాగాలేగానీ, కచేరీలో కూర్చుని పాడినట్లుగా నేనేం పాడగలనూ..? " అంటూనే కుర్చీని మంచం పక్కకు లాక్కుని కూర్చుంది.

ఆయనకు వారం రోజులుగా ఒంట్లో నలతగా ఉండటం వలన మందులు వాడుతూ డాక్టరు సలహాపై విశ్రాంతిగా మంచం మీదే పడుకుని ఉంటున్నాడు.

ఏవో కబుర్లు చెప్పుకోవాలనే ఉద్దేస్యంతోనే తనని పిలిచాడని ఆవిడకూ అర్ధమైంది.

" నువ్వు పాటలు బాగా పాడతావని...మన పెళ్ళిచూపులనాడు మీ వాళ్ళు చెప్పారు కదా..?" చిరునవ్వుతో ఆయన జ్ఞాపకం చేసేసరికి ఆవిడ మళ్ళీ పకపక నవ్వింది.

" బావుంది. ఆ నాటి మాటను..ఇపుడు గుర్తు చేస్తున్నారా..! మా పెదనాన్నగారి అబ్బాయి...రామం అన్నయ్య అపుడే మీకు వివరణ కూడా ఇచ్చాడుగా...' బాగా అంటే ఎక్కువగా అని అర్ధం గానీ చక్కగా అని మాత్రం కాదండోయ్' అని నవ్వాడు కూడా కదా ! అవునా..! తర్వాత నాతో ' పాటలతో ఇంటిని దడదడలాడించేస్తుందని చెప్పి బెదిరించాలనుకున్నాను, వాళ్ళేమిటే బాబూ, ఏదో సంతోషకరమైన సంగతి విన్నట్లుగా అలా

మిన్నకున్నారూ !! అంటే వాళ్ళకి గుండె ధైర్యం ఎక్కువేనన్నమాట...! ' అంటూ ఆటపట్టిస్తూ ఎంతగా నవ్వాడో..!" అంది విశాలాక్షి.

ఆ జ్ఞాపకంతో కాబోలు ఆవిడ పెదవులు చిరునవ్వుతో విచ్చుకుంటే, కన్నుల్లోకి మెరుపూ వచ్చింది..!

వాసుదేవరావు కూడా అప్పటి జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయాడు. " మీ రామం అన్నయ్యలాగే నాతోపాటూ వచ్చిన రమణా అల్లరివాడే ! మనం ముగ్గురం మాట్లాడుకుంటున్నపుడు...నీతో ' మీకు ముందు జాగ్రత్తగా చెబుతున్నాను...మా వాడికి కవిత్వం పిచ్చి జాస్తి. రాసే అలవాటు లేదుగానీ...కూసే అలవాటున్న ఓ పదిమందిని చేరదీసి...ఇంటిని వాళ్ళ కవితాగానాలతో దద్దరిల్లేలా గోలగోలగా మార్చేస్తాడండీ..! చెప్పాల్సింది నేను చెప్పేసాను..ఆ పైన మీ ఇష్టం..బాగా ఆలోచించుకోండి.' అంటూ నవ్వాడుగా.

వాడి అంచనా ప్రకారం..నువ్వు సరదాగా అయినా బెదురు, భయం నటించకుండా చెప్పిన సమాధానానికి నిజంగా మాకపుడు మతిపోయిందనుకో..! సరదాగా ఆ మాటల్ని ఇపుడు మళ్ళీ ఓ సారి చెబుదూ..! " ఆయన పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

ఆవిడ ఓ క్షణం చురుగ్గా చూసి, తర్వాత ముసిముసినవ్వుతో మొహం కొంచెంగా వాల్చి " అపుడేదో చిన్నతనంకొద్దీ, రమణగారి మాటలకు సరదాగా సమాధానం చెప్పేసాను. ఆయనలా కలుపుగోలుగా మాట్లాడుతుంటే, నేనూ మౌనంగా ఉండలేక ఏదో అనేసానుగానీ, ఇన్నేళ్ళ తర్వాత ఇంకా ఏం గుర్తుంటాయీ...?" అంది.

" నీకు గుర్తులేకపోవటం కాదులే, మొహమాటం పడుతున్నావనిపిస్తోంది ! అవునా ! నాకు మాత్రం...ఆ మాటలు మనసులో అలా ముద్రించుకుపోయాయి ! మర్చిపోవటంకాదు సరికదా, ఎన్నిసార్లు నెమరేసుకున్నానో..! అక్షరం పొల్లుపోకుండా చెప్పనా..?

'బాగా ఆలోచించుకోమని చెబుతూ నన్ను సరదాగా భయపెట్టాలనుకుంటున్నారని తెలుస్తోందిలెండి! అయినా ఇల్లు కవికుమారుల కవితాగానాలతో కళకళలాడుతుందనిపిస్తోందిగానీ నేనేం బెదిరిపోవటంలేదు ! పైగా మా నివాసం...విలసిల్లే విరిపందిరిలా, వికసించే సుమమంజరిగా మారుతుందనే ఆనందమే కలుగుతోంది!' అన్నావు. మేం ఇద్దరం ఆశ్చర్యంతో బిత్తరపోయినట్లుగా చూస్తుంటే, నువ్వు ' ఎందుకంతగా విస్తుపోతున్నారూ..? ఆ మధ్య చదివిన రెండు మాటలు గుర్తుకొచ్చి సందర్భాన్ని బట్టి చెప్పేసా. నాకూ రాసే శక్తి లేకపోయినా, అపుడపుడూ మాటల మధ్య కొటేషన్లు కూసే...సారీ..కోట్ చేసే అలవాటు మాత్రం ఉందంటూ నవ్వావుకదూ..!"

" అబ్బో బాగానే గుర్తుపెట్టుకున్నారే..! ఏదీ సరిగా గుర్తువుండదని అంటూవుంటారు, అది ఒట్టి మాటేనా..?" అంటూ విశాలాక్షి నవ్వు మొహంతో చూసింది.

" అన్నీ కాదుగానీ, కొన్ని ఇలాంటి తీపి జ్ఞాపకాలకి మాత్రం మరపు వుండదు..!" అన్నాడాయనా చిరునవ్వుతో.

" అవును...కొన్ని సంగతులు మరపుకు రాకుండా మనసులో ఎప్పటికీ పచ్చగానే ఉంటాయి ! మీ ఫ్రెండ్స్ అందరూ తరచూవచ్చి సందడిగా గడిపిన ఆ రోజులన్నీ నాకూ జ్ఞాపకం ఉన్నాయి! "

ఆవిడ మాటలకు ఆయన కొంచెం ప్రశ్నార్థకంగా చూస్తూ అన్నాడు " మేం అంతా సరదాగా కాలక్షేపం చేస్తూ..కాఫీలు, టిఫిన్లు అంటూ నిన్ను ఇబ్బంది పెడుతున్నానని విచారించినపుడెపుడూ నీకూ బాగానే ఉందనే మాట చెప్పనేలేదూ..?"

ఆవిడ చిన్నగా నవ్వింది.

" బావుంది. ఆ రోజుల్లో అలా చెప్పివుంటే ఏముందీ...మీరింకా జోరు పెంచేసేవాళ్ళుకదూ ! ఇపుడలాంటి కాలక్షేపాలన్ని తగ్గాయి కాబట్టి, నిశ్చింతగా చెబుతున్నా నన్నమాట ! " అంది.

" అవున్లే...అదీ నిజమే..! నువ్వు అడ్డుకట్ట వేస్తున్నట్లు అపుడపుడూ అభ్యంతరం చెబుతూండబట్టే..మా ప్రోగ్రాములూ కొంచెం మితంగా సాగుతూండేవి...!" అంటూ నవ్వాడు.

" నాకు ఇప్పటికీ గుర్తు. ఒకరోజు మీ అందరికీ ట్రేతో టీలు పట్టుకు వస్తున్న సమయంలో మీ ఫ్రెండు ఒకాయన శ్రీ శ్రీ మహాప్రస్థానం కాబోలు...గట్టిగా, ఆవేశంగా గానం చేస్తూ...' కనబడలేదా, మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధుగధుగలు..' అనేసరికి నాకు వణుకు వచ్చేసి...టీ కప్పుల్లోని టీ కూడా కొంచెంగా ట్రేలో ఒలికింది ! అది తలుచుకున్నపుడల్లా చాన్నాళ్ళు భలే నవ్వొచ్చేది కూడా !

ఇంకొకాయన ఎవరూ...పేరు వంశీయే అనుకుంటా... అవునా...ఎపుడు వచ్చినా అందరి కోరికపై పాతసినిమా పాటలు పాడేవారు. అసలు వాటికి ఏ మాత్రం తగ్గని స్థాయిలో ఆయన కంఠం అంత బావుండేది ! నేను ఇంట్లో పనులు చక్కబెట్టుకుంటూనే ఆ పాటలు వినటం ఎంత ఇష్టంగా ఉండేదో..! ఆ తరువాత కూడా కొన్నాళ్ళవరకూ నాకిష్టమైన కొన్ని పాటల్లోని ఆ చరణాలు చెవుల్లో గింగురుమంటూనే వుండేవి ! ఇప్పటికి కూడా అవి కొన్ని మనసులో మెదులుతూనే ఉంటాయి !

"ఈనాటి పున్నమి...ఏ నాటి పున్నమో...'

'ఆ చందమామలో, ఆనందసీమలో వెన్నెల స్నానాలు చేయుదమా....'

'పూచిన ప్రతి తరువొక వధువూ...పువుపూవున పొంగెను మధువూ....'

'పసిడి అంచు పైట జార...పయనించె మేఘబాలా....'

'చెలినవ్వులె నురుగులుకాగా...సెలయేరులు కులుకుతూ రాగా...'

'ఒడిలో చెలి మోహనరాగం...జీవితమే అనురాగయోగం..."

ఆగి ఆగి గుర్తు చేసుకుంటున్నట్లుగా...రెండు మూడు పాటల్లోని ఆ చరణాలను అలా రాగం తీస్తూనే..." అబ్బో ఇలా చెప్పుకుంటూ పోతే, లిస్టు చాంతాడవుతుంది...!" అంటూ నవ్వి మాటలు ముగించింది విశాలాక్షి.

ఆ రోజుల జ్ఞాపకంతో ఆయన పెదవులపైకీ మందహాసం వచ్చింది.

ఆవిడే మళ్ళీ మొదలుపెట్టింది " మీకూ గుర్తుందిగా...ఒకసారి మీ ఆఫీసువాళ్ళు కుటుంబాలతో ఏర్పాటు చేసిన కార్తీకమాస వనభోజనాలకు వెళ్ళినపుడు...ఒక ప్రోగ్రాం ఏదోగానీ...అందులో భాగంగా మన పెద్దవాళ్ళందరికీ ప్రశ్నాపత్రాలు ఇచ్చి జవాబులు రాయమన్నారు.  మీ బెస్ట్ ఫ్రెండ్ పేరేమిటీ అనే ప్రశ్నకు జవాబుగా మనమిద్దరం అనుకోకుండానే ఒకరి పేరు మరొకరు రాసేశాం ! అందరూ ఆశ్చర్యపోవటమే కాదు, అన్యోన్య దంపతులంటూ మనల్ని ఎంత ఆటపట్టించారో..! ఏదో పేరు చెప్పి గిఫ్టు కూడా ఇచ్చి మిమ్మల్ని ఓ రెండు మాటలైనా చెప్పాల్సిందేనని బలవంతపెట్టారు కదూ...! అపుడు మీరు చెప్పిన ఆ మాటల్ని అందరూ మెచ్చుకున్నారుకూడా ! ఇపుడోసారి మళ్ళీ చెప్పండీ!" ఆవిడ గోముగా అడిగిన తీరుకి ఆయన పెద్దగా నవ్వేసారు.

" ఇన్నేళ్ళ తర్వాత ..మన పిల్లలు పెద్దవాళ్ళయి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయాక...ఇంకా అప్పటి ముచ్చట్లు ఇపుడెందుకూ..అయినా నాకు గుర్తు కూడాలేదులే..!"

ఆ మాటలకు ఆవిడ " అబ్బో.." అంటూ నవ్వి " మరి ఇపుడే కదూ పెళ్ళిచూపులనాటి కబుర్లన్నీ నెమరేసుకున్నామూ..సరే, మీకు మొహమాటంగా ఉన్నట్లుంది..నేనే చెబుతా. ఆ వాక్యాన్ని నేను ఆ రోజు తర్వాత కూడా మనసులో ఎన్నిసార్లు మురిపెంగా మననం చేసుకున్నానో మరి !

' భార్యాభర్తల బంధానికి చెలిమి బలిమి తోడయితే, ఇద్దరిమధ్యా చక్కని అవగాహన కుదిరి...ఎలాంటి ఒడిదుడుకులైనా తేలిగ్గా ఎదుర్కోగలుగుతారు..ఆనందాన్నీ అందుకుంటారూ ! అని నా అభిప్రాయం..' అనే కదూ చెప్పారూ..?" అనడిగింది మెరిసే కళ్ళతో చూస్తూ. " అవును...మాటలేగా, తీయగా ఎన్నైనా చెప్పొచ్చు..!" నిర్లిప్తంగా జవాబిచ్చాడు.

ఆవిడ అతనివైపు చురుగ్గా చూసింది. " నేనేం అలా అనలేదే..? ఎందుకలా అపార్ధం చేసుకున్నారూ..? మీరు చేతల్లో చూపించినదానినే నిజాయితీగా మాటల్లో వెల్లడించారు ! అందువల్లేగా నేను విలువైన మాటగా భావించి గుర్తుపెట్టుకున్నానూ...! మాటకీ, చేతకీ పొంతన లేకపోతే విలువేం ఉంటుందీ..! "

ఆయన సరదాగా నవ్వేసాడు " ఈ మాట నీ నోట వినాలనే కోరికతో అలా అన్నానంతేలే ! సంసారంలో ఎవరికైనా ఆటుపోట్లు..అలకలూ, కలహాలూ..అన్నీ మామూలే, తప్పవు ! అన్నింటినీ తట్టుకుని ఆనందంగా ఉన్నామంటే...మన ఇద్దరిమధ్యా చక్కని సహకారం ఉండటంవలనేగా...! "

" అవును " అంటూనే ఆవిడ చటుక్కున లేచి నిలబడి " అయ్యో...మాటల్లో పడి కూర సంగతే మరచిపోయాను ! నోటికి మీకు హితవుగా ఉండాలని చేస్తున్నది కాస్తా పనికిరాకుండా అయ్యుంటుంది..! " అంది హడావుడి పడుతూ.

ఆయన ఆవిడ చేయి పట్టుకుని ఆపుతూ " కంగారుపడకు...ఫర్వాలేదు, పనికి రాకపోతే తీసేద్దాంలే ! పెరుగుతో సరిపెట్టేసుకుందాం ! ఇలా ఇన్నాళ్ళ తర్వాత..తీరుబడిగా కూర్చుని కబుర్లెన్నో నెమరేసుకున్నాం...! దాంతోనేమో తెలియదుగానీ మనసుకెంతో ఉల్లాసంగా ఉంది..తెలుసా ? " అన్నాడాయన చిరునవ్వుతో.

" నిజమే...మనసారా చెప్పుకున్న కబుర్లతో ఆనందమే కాదు, ఆరోగ్యమూ కలుగుతుందట, ఆయుష్షూ పెరుగుతుందట ! అందుకే, ఎవరమైనా మన మనసుల్లో...మధురమైన జ్ఞాపకాల్ని

మాత్రమే ఉంచుకుని...అపుడపుడూ నెమరేసుకుంటుంటే...జీవితం మధురం...మధురం..అనిపిస్తుంది కదూ..!" అంది విశాలాక్షి భర్త వైపు చిరునవ్వుతో చూస్తూ.